# మధుర గంధర్వ వాటి....

ఇంత అందమయిన కార్యక్రమం, అని తెలిసివుంటే మద్రాసు నుండి నడిచి వచ్చివుండేవాడిని" అన్నారు శ్రీకృష్ణశాస్త్రిగారు.

"గత పన్నెండేళ్ళుగా ఢిల్లీలో తెలుగువారు ఏర్పాటుచేసిన ఎన్నో కార్యక్రమాలు చూశాను గాని ఇంతచక్కటిదానిని చూడలేదు" అన్నా రొక పెద్ద.

"సాహిత్య సంగీత నృత్యాలు కలిసి ఉగాదికి ఇంత అందంగా స్వాగతం చెప్పడం అపూర్వమయిన అనుభవం" అన్నారు రసజ్ఞులు.

అది విరోధికృత్ నామ సంవత్సరం (1971) ఇంకొక అయిదారు గంటలలో అడుగుపెడుతుంది అనగా జరిగిన ఆ కార్యక్రమం.

అది శుక్రవారం. ఆఫీసులకు సెలవు దినం కాదు. అయినా ఈ కార్యక్రమానికి, "కృష్ణశాస్త్రితో ఒక సాయంకాలం" అన్న ఈ సాహిత్య సంగీత నృత్య కార్యక్రమానికి వందలాది స్త్రీ, పురుషులు రావడం ఆ మావ్లంకర్ హాలు కిటకిటలాడటం బహుశా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వారికే ఆశ్చర్యం కలిగించి వుండాలి.

ఈ "సాయంకాలం" లో పాల్గొనడానికని మద్రాసునుండి శ్రీ పాలగుమ్మి పద్మరాజు, అహమ్మదాబాదునుండి శ్రీబాలాంత్రపు రజనీకాంతారావు రావడం ఢిల్లీ తెలుగువారికి మరింత ఆనందం కలిగించింది.

''జయ జయ ప్రియ భారత జనయిత్రి'' అన్న ప్రార్థనతో కార్యక్రమం మొదలయింది. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రికి "వందనమయ్యా" అంటూ (విశ్వకవికి అంజలి ఘటిస్తూ వారే రచించిన గీతంతో) గానంతో, నృత్యంతో స్వాగతం చెప్పారు. పూలమాల వేశారు చిన్నారి బాలలు.

''తెలుగు సాహితి"అధ్యక్షులు శ్రీ సంజీవయ్య తమ సహజ గంభీరమైనరీతిలో తెలుగు కవితారంగాన భావకవిత్వానికి ప్రోదిచేసిన ఆద్యులలో ఒకరయిన కృష్ణశాస్త్రిగారికి స్వాగతం చెప్పారు.

"డబ్బునతడాశించలేదు. పదవులకోసం అతను ప్రాకులాడలేదు. ఉద్యోగాలనతడు వెతకలేదు. తన చిత్తంవచ్చినరీతిని హాయిగా జీవిస్తూ కమ్మటి కవిత రాశాడు. స్వచ్ఛమైన సెలయేటివలె తీయదనాన్ని పంచిపెడుతూ జీవయాత్ర సాగించాడు. ఎందరో అతనిని దూషించారు. అతడు రాసిన భావకవితను విమర్శించారు. ఈ దూషణను, ఈ విమర్శను, ఈ ఛాందసాలను అతడు లెక్కచేయలేదు. వాటన్నిటికీకూడా తన మధురమైన కవితతో, గానంతో జవాబు చెప్పాడు. ఆధునిక తెలుగు కవితారంగపు వసంతఋతువు నందు పంచమ స్వరాన పాడినకోయిల అతడు--" అన్నారు. శ్రీ కృష్ణశాస్త్రి సహాధ్యాయి, తెలుగు సాహితి ఉపాధ్యక్షులు అయిన ఆచార్య గంటి జోగి సోమయాజిగారు.

పాలగుమ్మి పద్మరాజుగారు నిదానంగా అతి స్వారస్యంగా మాటలాడారు.

"మడత నలగని బట్టలు, నల్లని గిరజాల జుత్తు (నలుపుకు కారణం నాకు తెలియదు). సువాసనలు, చిరునవ్వు ఇదీ శాస్త్రిగారంటే.... ఆయనకు అపరిశుభ్రత అంటే చాల అయిష్టం. ఇంట్లో ఎక్కడన్నా చెత్త కనబడితే చేత చీపురుదాల్చి శుభ్రం చేస్తారు....మహా బద్ధకస్తులు అని ప్రతీతి....అది అబద్ధంకాదు -- ఈ మనిషిలోనే కలలుగనే మనిషి ఒకరున్నారు. అవి

ఎంతందమయిన కలలు! ఆ కలలను ఈ ఇల మీదికి తేవాలనిచేసే ప్రయత్నాలు ఆయన కవితలు........ ఆయన ప్రతిపదాన్ని రత్నాన్నిచెక్కినట్లు చెక్కుతారు. సినిమా పాటయినాసరే సరయిన పదం పడడానికోసం ఆయన ఒక్కోసారి ఏ నెలరోజులో వెతుకుతూ, మధన పడుతుంటారు. అందుకనే ఆయన రచనలు అపూర్వంగా, విశిష్టంగా వుంటాయి. ఆయన వచన రచనలు వాటికవే సాటి, మనిషి అంటే ఎంత ఇష్టం! లోపాల్ని చనువుతో క్షమిస్తూ బాధల్ని కన్నీటితో పంచుకుంటూ భూత వర్తమాన లోకాన్ని అన్నిరంగులలోనూ గొప్పగా చిత్రించారు" అంటూ చెప్పారు పద్మరాజు.

తమకూ, "మామయ్య" కృష్ణశాస్త్రిగారికీమధ్యగల అనుబంధాన్ని వివరిస్తూ శ్రీ రజనీకాంతారావు, శాస్త్రిగారి కంకితం చేసిన తమ "విశ్వవీణ" లోని పద్యాలను గానం చేశారు. శాస్త్రిగారి కవితలొకటి రెండింటికి తమ ఆంగ్లాను వాదాలను పఠించారు.

"శ్రీ కృష్ణశాస్త్రిగారు నాకుగాదులు లేవు" అన్నా ఢిల్లీ తెలుగు వారికి శ్రీ శాస్త్రిగారి రాకతో ఉగాది కళకళలాడుతూ వచ్చింది. శ్రీ శాస్త్రి గారు తమ కవితద్వారా పంచిపెట్టిన బాధ ఎంత తీయనిది!" అంటూ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆనాటి కార్యక్రమ బాధ్యతలలో పాలు పంచుకున్న ఇక్కడి ఆంధ్రప్రదేశ్ సమాచార కేంద్రపు అధికారి శ్రీకాటగడ్డ భాస్కరరావు.

ఆ తర్వాత "తెలుగుసాహితి"తరపున శ్రీవాకాటి పాండురంగారావు అభినందన పత్రం పఠించగా. శ్రీ సంజీవయ్య కృష్ణశాస్త్రి గారికి శాలువ కప్పి, అభినందన పత్రాన్ని, దంతపు శ్రీకృష్ణుడి బొమ్మను సమర్పించారు.

"సాయంకాలం అంటే సందేహం వంటిది. వెలుగో చీకటో తెలియనిది. కాని ఇది వేరే సాయంకాలం. ఇది మధురమైన సాయంకాలం.

మీ అందరికీ నేనంటే ఎంతఆదరణ! మీరందరూ ఇట్లాగే నా పాటలు పాడుకుంటూ వుంటే నేను మరొక ఇరవైవెదేళ్ల సాయంకాలాలు బ్రతికి ఇంకా మంచి పాటలు రాస్తాను. మనిషిలో పాలు పోయాలి. అమృతం పోయాలి అందరూ" అన్నారు శాస్త్రిగారు ఈ సాయంకాలానికి గుర్తుగా తెలుగువారు వెలువరించిన "సువెనీర్"లో శాస్త్రిగారికి ఆధునిక తెలుగుసాహిత్యం ప్రపంచంలోగల విశిష్టస్థానాన్ని సాధికారంగా వివరిస్తూ వ్రాసిన ఆంగ్ల తెలుగు వ్యాసాలున్నాయి. శ్రీయుతులు పద్మరాజు ఆకెళ్ళ అచ్యుతరామం. ఆర్. ఎస్. భరద్వాజ తెలుగువ్యాసాలు వ్రాశారు. శ్రీ గంటి జోగిసోమయాజి ఆంగ్లంలో వ్రాశారు.

మధురగాయని శ్రీమతి వక్కలంక సరళారావు ఆధ్వర్యాన "స్వర లహరి" బృందంవారు శ్రీకృష్ణశాస్త్రి పాటలను అద్భుతంగా పాడారు. 'ఆండాళ్' సంక్రాంతినుండి ఉగాదికి'' అన్నశాస్త్రిగారి సంగీతరూపకాలను నృత్యాలుగా మలిచి. ప్రేక్షకులకు మరపురాని అనుభవాలుగా నిలిచేటట్లు ప్రదర్శించారు. మరునాటి ఆంగ్ల దినపత్రికలన్నీకూడా ఈ "కృష్ణశాస్త్రి గారితో ఒక సాయంకాలం" గురించి సవివరంగా ప్రస్తావించి సంగీత నృత్య కార్యక్రమాన్ని ముఖ్యంగా ''సంక్రాంతినుండి ఉగాదికి' అన్న రూపకాన్ని మెచ్చుకున్నారు.

ఢిల్లీ ఇదివరలో గురజాడ శతజయంతి పండుగ చేసుకుంది. శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులుగారిని సన్మానించింది. ''తెలుగుసాహితీ', ద్వారా ఢిల్లీ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, కొడవటిగంటి. రాచకొండ విశ్వనాథశాస్త్రి మొక్కపాటి నరసింహశాస్త్రివంటి మేధావులను గౌరవించింది. మళ్లీ ఈనాడు కనులకు వీనులకు పండువయిన ఉగాది కార్యక్రమంతో శ్రీకృష్ణశాస్త్రిని గౌరవించింది.

[23, ఏప్రిల్--71]